నిలోఫర్‌ను సందర్శించిన ఎన్‌హెచ్‌ఎం వైద్యులు



ఆసుపత్రిని సందర్శించిన వైద్యుల బృందంతో డాక్టర్ రవికుమార్

నాంపల్లి: ప్రముఖ నవజాత శిశు సంరక్షణ కేంద్రం నిలోఫర్ ఆసుపత్రిని గురువారం సాయంత్రం యూనిసెఫ్, నేషనల్ హెల్త్ మిషన్‌కు చెందిన వైద్యుల బృందం సందర్శించింది. నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ నేతృత్వంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ నియోనటాలజీ సేవలను పరిశీలించింది. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు పలు విభాగాల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. నిలోఫర్ ఆసుపత్రిని సందర్శించిన వారిలో నేషనల్ హెల్త్ మిషన్ మధ్యప్రదేశ్ డిప్యూటీ డైరెక్టర్ అండ్ చైల్డ్ హెల్త్ డాక్టర్ హిమాని యాదవ్, టెలి మెడిసిన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రూబీ ఖాన్, డివిజనల్ కో ఆర్డినేటర్ మౌనిక, భోపాల్ యూనిసెఫ్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రశాంత్ కుమార్ ఉన్నారు. నిలోఫర్ ఆసుపత్రిలో అందుతున్న సేవలను వారు ప్రశంసించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మదర్ మిల్క్ బ్యాంక్‌ను చూసి దేశంలోనే అతి పెద్ద కౌన్సిలింగ్ సెంటర్ అని కొనియాడారు.

కమ్యూనిటీ హాల్‌ను పునర్ నిర్మించండి



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం:10లోని సింగాడ బస్తీలో కమ్యూనిటీ హాల్‌ను పునర్‌నిర్మించాలని బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ కమ్యూనిటీ హాల్ సమస్య పెండింగ్‌లో ఉందని ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నూతన కమ్యూనిటీ హాల్ కోసం ప్రతిపాదనలు రూపొందించి నిధులు మంజూరు చేయించి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సింగాడబస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జవ్వాది అనిల్‌కుమార్, సతీష్‌కుమార్, మూర్తి, గంగరాజు, సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.


బీరు బాటిల్‌తో దాడి.. కేసు నమోదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-11లోని ఉదయ్‌నగర్ బస్తీకి చెందిన అమర్ సింగ్ అనే వ్యక్తికి అదే ప్రాంతానికి చెందిన చందర్ అనే వ్యక్తితో పాత కక్షలు ఉన్నాయి. ఇద్దరూ కొంతకాలంగా మాట్లాడుకోవడం లేదు. బుధవారం సాయంత్రం అమర్‌సింగ్ ఇంటి బయట కూర్చొని ఉండగా అదే సమయంలో అక్కడికి వచ్చిన చందర్ బీరు బాటిల్‌తో అమర్ తలపై దాడి చేశాడు. ఈ ఘటనలో అమర్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంజారాహిల్స్‌లో అర్ధరాత్రి కారు బీభత్సం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లో బుధవారం అర్ధరాత్రి అదుపుతప్పిన వేగంతో దూసుకెళ్తున్న ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన కె.అనిరుథ్ అనే విద్యార్థి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో అనిరుథ్ రోడ్డునెంబర్-12 నుంచి విరించి ఆస్పత్రి వైపు ఐ20 కారులో దూసుకెళ్తున్నాడు. పిజ్జా హట్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు దెబ్బతినగా, అనిరుథ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



శివరామకృష్ణ (ఫైల్)

సాక్షి, సిటీ బ్యూరో: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్రినాకకు చెందిన శివరామకృష్ణ(28) రెండు రోజుల క్రితం నాగమయ్య కుంటలో ఉండే బావ మహేష్ ఇంటికి వచ్చాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో శివరామకృష్ణ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బావ మహేష్ పని ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చి డోర్ తెరిచి చూడగా నిర్జీవంగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నాళ్లిలా..?

- పేదల బస్తీని పట్టించుకోరా..
- ఏళ్ల తరబడి పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగు
- తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్న వయోవృద్ధులు, చిన్నారులు
- పట్టించుకోని అధికారులు, సిబ్బంది



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు



అంబేడ్కర్‌నగర్ బస్తీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

చార్మినార్: ఇది ఓ పేదల బస్తీ. ఈ బస్తీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి గురవుతోంది. ఇది ఎక్కడో శివారు ప్రాంతం కాదు. పాత నగరం నడిబొడ్డులోని పలక్‌నుమా నాగులబండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నగర్ బస్తీ. ఇక్కడ డ్రైనేజీ సమస్యతో స్థానికులు ఏళ్ల తరబడి పడరాన్ని పాట్లు పడుతున్నారు. నిజాం కాలం నుంచి ఉన్న ఈ బస్తీలో అస్తవ్యస్తమైన డ్రైనేజీతో వయోవృద్ధులు చిన్నారులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ విషయం సంబంధిత జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్‌తో పాటు డిప్యూటీ కమిషనర్ డ్రైనేజీ విభాగం సిబ్బందికి తెలిసినప్పటికీ మా వైపు కన్నెత్తి చూడడం లేదని బస్తీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బస్తీని సందర్శించి శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ వ్యవస్థను తొలగించి కొత్త పైప్‌లైన్ వేసి సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని వినతి..

అంబేడ్కర్‌నగర్ బస్తీలో కొత్తగా డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని అంబేడ్కర్ నగర్ అసోసియేషన్ ప్రతినిధులు జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నను కోరారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ..కొన్ని ఏళ్లుగా తమ బస్తీలోని డ్రైనేజ్ పైప్‌లైన్ శిథిలావస్థకు చేరుకొని మురగు నీరు రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. దీంతో స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. సాధ్యమైనంత వెంటనే డ్రైనేజీ పైప్‌లైన్ పనులను చేపట్టి అనంతరం సీసీ రోడ్డు వేయాలని వారు డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బాబురావు, ప్రధాన కార్యదర్శి గోధ ఈశ్వర్, ముఖ్య సలహాదారులు బోయిన విజయ్ కుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో పదోన్నతులు వెంటనే చేపట్టాలని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 3194 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌సుందర్, జనరల్ సెక్రెటరి బొందుగుల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. వారు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ..డీపీసీ జీవో వచ్చి కూడా నెలలు గడుస్తున్నా ప్రమోషన్లు చేపట్టడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. 40 ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తూ ప్రమోషన్స్ రాకుండానే అనేక మంది ఉద్యోగులు పదవీ విరమణ చెందుతున్నారన్నారు. సీనియార్టీ లిస్టులను వెంటనే ఫైనలైజ్ చేసి ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని అన్ని కేడర్ల ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని వారు కోరారు. అదేవిధంగా ఇటీవల రాత పరీక్షలు నిర్వహించి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న ఏఎన్‌ఎంలు ల్యాబ్ టెక్నీషియన్లు ఫార్మసిస్టులు స్టాఫ్ నర్సులు వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రెటరీ గోవింద్ రెడ్డి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ గౌడ్ కోశాధికారి భోగ ప్రకాష్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్, సత్యనారాయణ గౌడ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు భాస్కర్, సత్యనారాయణ గౌడ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రవికుమార్, రాష్ట్ర నాయకులు జ్ఞానేశ్వర్, నర్సిరెడ్డి భూషణ్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన తెలంగాణ కళా ఉత్సవాలు



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: నేటి యువతలో దేశభక్తి భావంతో పాటు శాస్త్రీయ సాంస్కృతిక వారసత్వ సంపదపై కూడా మక్కువ కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందని పలువురు వక్తలు అన్నారు. గురువారం రవీంద్ర భారతిలో అక్షిత ఫౌండేషన్, నటరాజ అకాడమిల 12వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జైహింద్ పేరిట నిర్వహించిన తెలంగాణ కళా ఉత్సవాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ..శాస్త్రీయ కళలను భవిష్యత్ తరాలకు అందించడంలో సాంస్కృతిక సంస్థల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం పలువురు నాట్య గురువులకు ఐకాన్ అవార్డులను ప్రదానం చేశారు. జానపద, శాస్త్రీయ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో నటరాజ అకాడమీ వ్యవస్థాపకులు నల్లగిరి, ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమ భోగరాజు, పలువురు నాట్య గురువులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి



వకుళాభరణం కృష్ణ మోహన్‌రావుకు బీసీ మేధా పురస్కారాన్ని అందజేస్తున్న పలువురు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మీట్ మీ ఎబ్రాడ్ ఓవర్‌సీస్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో సంగీత నృత్య నీరాజనం పేరిట నిర్వహించి పలు కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావుకు బీసీ మేధా, సంఘ సేవకురాలు పోతుమంచి సరసిజ దేవి పేరిట సామాజిక సేవా రంగంలో సేవలందిస్తున్న వారికి సేవా ఐకాన్ అవార్డులను అందజేశారు. అదేవిధంగా 10 మంది దివ్యాంగులకు వీల్‌చైర్‌లు, 20 మంది దివ్యాంగులకు నెలసరి సరుకులు, ఇద్దరు విద్యార్థులకు ఫీజుల చేయూతకై సహాయాన్ని అందజేశారు. అనంతరం వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలీల ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్.ఆదినారాయణ, రచయిత్రి శశిబాల, సంస్థ డైరెక్టర్ పి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పులిపాటి రాజేష్ కుమార్

చార్మినార్: పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్తలు, సీనియర్ నాయకులు కృషి చేయాలని ప్రదేష్ కాంగ్రెస్ కమిటీ పరిశీలకులు సుబ్రమణ్య ప్రసాద్, సురేష్ కుమార్ అన్నారు. బహదూర్‌పురా శాసనసభ నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం దూద్‌బౌలిలో నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిలుగా హాజరైన వారు మాట్లాడుతూ.. ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరుకు కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ స్థాయి వరకు పటిష్ఠంగా ఉండాలని..ఆ మేరకు తీసుకోవాల్సిన, నిర్ణయాలన్నింటి పై సమావేశాలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న అన్ని రకాల పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా మనమంతా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. త్వరలో డివిజన్ స్థాయిలో కూడా ఈ సమావేశాలు జరిపి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో మరింత బలపడేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ముందుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి. కన్నయ్య లాల్, సయ్యద్ షా ముజాహిద్, ఇక్బాల్, జబ్బార్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, జ్యోతి శెట్టి, బిలాల్, అన్ని డివిజన్ల అధ్యక్షులు భాను చందర్ యాదవ్, నజీర్ ఖాన్, నసీర్ ఫారూఖ్, హమీద్ ఉద్దీన్, మెహ్రాజ్ బేగం, జాకేర్ హుస్సేన్, అలీ షాన్, బారి, శ్రీకాంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు, సునీల్ అగర్వాల్

అబిడ్స్: గోషామహల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు, సీనియర్ నాయకుడు సునీల్ అగర్వాల్ ఘనంగా సత్కరించారు. ఇటీవల గోషామహల్ పోలీస్‌స్టేషన్ నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను వారు గురువారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణకు బజరంగ్ సేన ఆధ్వర్యంలో తమవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. సమాజ శ్రేయస్సుకు, సమాజ అభ్యున్నతికి బజరంగ్ సేన కృషి చేస్తుందన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గోల్కొండ: ప్రైవేటు ఆసుపత్రులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని సీనియర్ ఐఏఎస్ అధికారి సయ్యద్ ఉమర్ జలీల్ అన్నారు. గురువారం నానల్‌నగర్ డివిజన్ అల్‌హసనత్ కాలనీలో ఎంజీ ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ..ఉచిత వైద్య శిబిరాలు ఆసుపత్రి ప్రచార సాధనాలుగా ఉండరాదన్నారు. పేదల బస్తీల్లో సైతం వైద్య శిబిరాలు నిర్వహించి నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్‌హసనత్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్లా బిన్ తదితరులున్నారు.

'మనం సైతం దేశం కోసం' ర్యాలీలో పాల్గొనండి



ప్యారసాని వెంకటేష్

చార్మినార్: ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా నిర్వహించిన మన సైనికులకు మద్దతుగా ఈనెల 17న సాయంత్రం 5 గంటలకు ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించే 'మనం సైతం దేశం కోసం'ర్యాలీలో పాల్గొనాలని బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ప్యారసాని వెంకటేష్ కోరారు. ఆలయాల కమిటీల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, సభ్యులు, విద్యార్థి సంఘాలు, పార్టీలకు అతీతంగా పాల్గొని దేశ సైనికులకు మద్దతు తెలపాలని ఆయన కోరారు. వారి సేవలను కొనియాడుతూ ర్యాలీలో పాల్గొనాలని ఆయన సూచించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

నాంపల్లి: ఓ యువతి అదృశ్యమైన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..అఫ్జల్‌సాగర్‌లో నివాసం ఉండే శేష సువర్ణ, దుర్గయ్య కుమార్తె ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు అన్ని చోట్ల వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో తల్లి శేష సువర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

శాంతినగర్‌లో నివాసం ఉండే సల్మా బేగం, యూనుష్ షేక్ కుమారుడు హర్బాజ్ ఖాన్(25) మార్చి నెల 22వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బయటకు వెళ్లిన తన కుమారుడు ఎక్కడా కనిపించడం లేదంటూ తల్లి సల్మా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో 20 సార్లు ఇంటి నుంచి బయటకు వెళ్లాడని, బయటకు వెళ్లిన ప్రతిసారి తిరిగి వచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ ఈసారి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమారుడు రెండు నెలలు గడిచినా తిరిగి రాలేదని తెలియజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హ్యాట్సాఫ్.. పోలీస్



శ్రీనివాసరావును సత్కరిస్తున్న డాక్టర్ అయేషా

అబిడ్స్: కుటుంబ కలహాలతో కలత చెందిన ఓ వైద్యురాలు హైదరాబాద్ ఉమెన్ పోలీస్ డీసీపీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ డీసీపీ లావణ్య జాదవ్‌ను కలిసి తన సమస్యను వివరించగా ఆమెను షాహినాయత్‌గంజ్‌లోని సౌత్‌వెస్ట్ జోన్ మహిళా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని సూచించారు. అక్కడికి వచ్చిన వెంటనే ఆమె మహిళా పోలీసులు, ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావులను కలిసి తన వివరాలను చెప్పారు. వెంటనే వారు డాక్టర్ ఆయేషా ఫిర్యాదు చేసిన వ్యక్తిపై కేసును నమోదు చేసి కోర్టులో ఛార్జీషీట్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆయేషా మాట్లాడుతూ.. హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడడం, వారికి కౌన్సిలింగ్, సలహాలు ఇవ్వడం ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. తాను ఎంతో భయంగా మహిళా పోలీస్‌స్టేన్‌కు వచ్చానని కానీ ఇక్కడ పోలీసులు ఎంతో మర్యాదగా తన కేసును తీసుకొని పరిష్కారం దిశగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. తనకేసు కాకుండా మిగతా మహిళల కేసులు కూడా పరిష్కారమే దిశగా ప్రయత్నిస్తున్నారని అందరికి మర్యాదనిస్తూ వారిలోని భయాన్ని దూరం చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్క మహిళా ధైర్యంగా తనకు జరుగుతున్న అన్యాయాన్ని మహిళా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చునని భరోసా కలిగిందన్నారు. హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు కలిసి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

దోమల నివారణే లక్ష్యంగా పని చేయాలి



బల్దియా ఎంటమాలజీ సిబ్బందితో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: దోమల నివారణే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. నియోజకవర్గం ఎంటమాలజీ సిబ్బంది గురువారం ఆయనను టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దోమల నివారణకు బల్దియా ఎంటమాలజీ ఉన్నతాధికారులు ప్రతిష్టమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. బుల్కాపూర్ నాలా, లంగర్‌హౌస్, టోలిచౌకీ, గోల్కొండ డివిజన్‌లలోని గోల్కొండ కందకాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయన్నారు. లంగర్‌హౌస్ హెచ్‌ఎండీఏ చెరువు, గోల్కొండ నయాకీలాలోని శాతం చెరువులు కూడా పూడికతలతో నిండి దోమలను వృద్ధి చేస్తున్నాయన్నారు. పారిశుద్ధ్య విభాగం, ఎంటమాలజీ విభాగం వారు సమన్వయంతో ముందుకు సాగితే దోమల నివారణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఉన్నారు.

'ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణం'



మాట్లాడుతున్న మౌలానా కారీ మతీన్ ఆలీషా

గోల్కొండ: ఆపరేషన్ సిందూర్ భారత దేశానికే గర్వకారణం అని అఖిల భారత కారీ సంఘం అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రి అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై గురువారం గోల్కొండ రిసాల బజార్‌లోని మసీదులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత దేశం అత్యంత పటిష్టమైన దేశం అని ఆపరేషన్ సిందూర్ భారతదేశ శక్తిని ప్రపంచానికి తెలిసిందన్నారు. సామాన్య పౌరులు, గృహాలపై దాడి చేయకుండా కేవలం ఉగ్రవాద స్థావరాలనే మట్టుపెట్టడం వెనుక భారతదేశ నీతిని కూడా ప్రపంచ దేశాలు గుర్తించాయన్నారు. ఇస్లాం మతంలో, దివ్య ఖురాన్ గ్రంథంలో సైతం ఉగ్రవాదానికి చోటు లేదన్న విషయం స్పష్టంగా ఉందన్నారు. ఉగ్రవాద చర్యలకు పాల్పడే వారికి దేవుడు కూడా క్షమించడన్నారు.

కార్మిక ఉద్యోగులకు అండగా ఎంప్లాయీస్ యూనియన్



శ్రమశక్తి అవార్డు గ్రహీత లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

అబిడ్స్: మెట్రో వాటర్ బోర్డులోని కార్మిక ఉద్యోగులకు ఎంప్లాయీస్ యూనియన్ అండగా ఉండి వారి అభ్యున్నతికి కృషి చేస్తుందని శ్రమశక్తి 2025 అవార్డు గ్రహీత, ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంచే 2025 శ్రమశక్తి అవార్డు పొందిన లక్ష్మీనారాయణను గురువారం వాటర్ బోర్డు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..30 ఏళ్లకు పైగా కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్న తనకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రమశక్తి అవార్డు అందించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఆర్.రమేష్, మేనేజర్ సత్యనారాయణ, సీనియర్ ఆఫీసర్ వై.నాగేశ్వర్‌రావు, సిబ్బంది జగదీష్, గణేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గారెడ్డి క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డికి కుల పిచ్చి అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్‌అన్నారు. జగ్గారెడ్డి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై చేసి కుల దుహంకార ప్రకటనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గురువారం గుడిమల్కాపూర్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ..కాంగ్రెస్‌లో మొదటి నుంచి అగ్ర కులాలదే ఆదిపత్యం అని అందువల్లే ఆ పార్టీలో కుల పిచ్చి బాగా ముదిరిందన్నారు. అటువంటి కాంగ్రెస్ నాయకుల్లో జగ్గారెడ్డి మొదటి వరుసలో వస్తారన్నారు. ఈటల రాజేందర్‌పై జగ్గారెడ్డి చేసిన వాఖ్యలు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలాంటిదని ఆయన స్పష్టం చేశారు. జగ్గారెడ్డి క్షమాపణ చెప్పకపోతే ఆయనకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు అర్జున్‌కుమార్, ప్రభుపూజారి, గుడిమల్కాపూర్ బీజేపీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌సాగర్, కింగ్ సాగర్, బి.యాదగిరి తదితరులున్నారు.



స్వరూపారాణిని సత్కరిస్తున్న దృశ్యం

స్వరూపారాణికి సత్కారం

గోల్కొండ: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారాణి వెటరన్ లయన్ స్వరూపారాణిని గురువారం మాసాబ్ ట్యాంక్‌లోని సి.కె.నాయుడు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ ఫౌండర్ కార్యదర్శి కమ్మెల సాయిబాబా మాట్లాడుతూ..స్వరూపారాణి యోనెక్స్-సన్‌రైజ్ 47వ ఇండియన్ వెటరన్స్ మాస్టర్స్ లయన్ స్వరూపారాణి విశేష ప్రతిభ కనబరిచారన్నారు. ఆమె స్ఫూర్తితో ఔత్సాహిక యువ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ముందుకు సాగే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నవ భారత్ లయన్స్ క్లబ్ సభ్యులతో పాటు యోగా గురువు సరోజినిరామారావు, తెలంగాణ బీపీఏఐ సంఘం అధ్యక్షుడు ఎస్.రఘు, జి.కృష్ణవేణి, డాక్టర్ జ్యోతి, రాజా, హిప్నో డాక్టర్ పద్మాకమలాకర్ తదితరులు పాల్గొన్నారు.